కబ్జాకోరల్లో పార్కుస్థలాలు

- బై నంబర్లు వేసి అమ్ముకుంటున్నవైనం..
- మున్సిపాలిటీలో 40కాలనీలుండగా, 10 కాలనీల్లో కూడా కనిపించని పార్కుస్థలాలు
- ఉన్నవాటికి రక్షణ కరువు..

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 6 : ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో విలువైన పార్కుస్థలాలు క్రమంగా మాయమైపోతున్నాయి. భూముల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో పార్కుస్థలాలపై కబ్జాదారుల కన్ను పడుతున్నది. ఇప్పటికే వెంచర్లు చేసిన వారు పార్కు స్థలాలకు బై నంబర్లు ఇచ్చి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. ఈ విషయమై పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

కాలనీల ఏర్పాటుకు ముందు..

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో సుమారు 40నుంచి 50వరకు కాలనీలున్నాయి. వీటిలో అనధికారికంగా చేసిన కాలనీలు ఉన్నాయి. కాలనీల ఏర్పాటుకు ముందు పది శాతం స్థలాన్ని పార్కుల కోసం వదిలి పెడుతున్నారు. గతంలో మేజర్ గ్రామ పంచాయతీ ఉన్నప్పుడు పార్కుల కోసం స్థలాలను వదిలిపెట్టారు. క్రమంగా భూముల ధరలు పెరిగిపోతుండడంతో హెచ్ఎండీఏ అప్రూవల్ లేని కాలనీల్లో ఉన్న ప్లాట్లకు బై నంబర్లు ఇచ్చి విక్రయిస్తున్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయల విలువ చేసే పార్కు స్థలాలను మాయం చేశారు. ప్రస్తుతం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో హెచ్ఎండీఏ అప్రూవల్ ఉన్న జేబీ, శ్రీరాంనగర్, ఎన్ఆర్ఐ వెంచర్‌తో పాటు శేరిగూడలోని మరికొన్ని వెంచర్లల్లో మాత్రమే పార్కు స్థలాలున్నాయి. ఆర్టీసీ కాలనీ, తిరుమలానగర్, భవానీనగర్‌తో పాటు పలు విలువైన కాలనీల్లో పార్కుస్థలాలు మాయమయ్యాయి.

భాగ్యనగర్ కాలనీలో కోర్టు ద్వారా దక్కించుకుని కమ్యూనిటీ హాల్ నిర్మించుకున్న కాలనీవాసులు

కోర్టుకు వెళ్లి పోరాడి సాధించుకున్న కాలనీవాసులు

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని భాగ్యనగర్-1, 2 కాలనీల్లో పార్కుల కోసం సుమారు 3వేల గజాల స్థలాన్ని వదిలిపెట్టారు. క్రమంగా ఆ స్థలాన్ని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నించగా, కాలనీవాసులు కోర్టుకు వెళ్లి ఆ స్థలాన్ని దక్కించుకున్నారు. భవిష్యత్తులో ఆ స్థలం కబ్జాకాకుండా ఉండేందుకు ఆ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించడంతో పాటు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడిందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

ఉన్నవాటికి రక్షణ కరువు..

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని విలువైన కాలనీల్లో అక్కడక్కడున్న కొద్దిపాటి పార్కు స్థలాలను పరిరక్షించడంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదని ఆరోపణలున్నాయి. ఎంబీఆర్ నగర్‌లో పార్కు స్థలం ఉన్నప్పటికీ దాని చుట్టూ ప్రహరీ నిర్మించలేకపోతున్నారు. పార్కు స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డును సైతం తీసి పక్కన పడేశారు. పార్కుస్థలాన్ని పరిరక్షించకపోతే ఆ స్థలం కూడా కనుమరుగయ్యే అవకాశాలున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. బృందావన్‌నగర్ కాలనీ, ప్రగతినగర్ కాలనీలతో పాటు వివిధ కాలనీల్లో ఉన్న విలువైన పార్కు స్థలాలను పరిరక్షించాలని కోరుతున్నారు. ఇప్పటికే ఆయా కాలనీల్లో ఉన్న పార్కుస్థలాలు సగం వరకు కుచించుకుపోయాయని పరిరక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మూలన పడ్డ ఎంబీఆర్‌నగర్‌లో పార్కు స్థలం వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

రక్షణ కల్పిస్తాం

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపట్నం, ఖానాపూర్, సీతారాంపేట్, శేరిగూడ గ్రామాల్లో ఉన్న పార్కు స్థలాలను గుర్తించి వాటిని పరిరక్షించడానికి తగిన చర్యలు తీసుకుంటాం. కనుమరుగయ్యే వాటిని వెలికితీసే పని చేపడతాం. పార్కుస్థలాలు ఆక్రమణకు గురికాకుండా ప్రహరీ నిర్మిస్తాం.

- రవీంద్రసాగర్, మున్సిపల్ కమిషనర్

అసైన్డ్ భూమి కబ్జా.. ఇరువర్గాల దాడి

- పలువురికి గాయాలు

దోమ, అక్టోబర్ 6 : అసైన్డ్ భూమి కబ్జా విషయంలో ఇరువర్గాలు దాడి చేసుకోగా ఇద్దరికి తీవ్రగాయాలు, మరికొంత మందికి స్వల్పగాయాలైన సంఘటన దోమ మండల పరిధిలోని రాకొండ గ్రామంలో జరిగింది. ఎస్ఐ ఆనంద్‌కుమార్ కథనం ప్రకారం.. 1983లో సర్వే నం.94లో ప్రభుత్వం 8 మంది రైతులకు 21 ఎకరాల అసైన్డ్ సర్టిఫికెట్లు అందజేసింది. అందులో చాపల రాములుకు 2.12 గుంటలు, బండి ఇస్వయ్యకు 2.12 గుంటల భూమి కలదు. గుట్టలు ఉండటంతో ఉన్న కొద్దిపాటి భూమిలో ఇద్దరూ సాగు చేసుకుంటూ వస్తున్నారు. కొన్ని సంవత్సరాల నుంచి ఈ భూమి తమదంటే తమదని గొడవపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ భూమి వద్దకు ఎవ్వరూ వెళ్లరాదని అధికారులు చెప్పడంతో కొన్నేండ్లు భూమి పడావు పడింది. ఈ క్రమంలో భూమి విషయంలో చాపల రాములు కోర్టుకు వెళ్లి జడ్జిమెంటు కాపీ తెప్పించుకున్నాడు. భూమిని బండి ఇస్వయ్య కుమారులు మనోజ్, నర్సింహులు చదును చేయడాన్ని గమనించి.. ఈ భూమిపై తమకే జడ్జిమెంటు వచ్చిందని మీరెలా సాగు చేస్తారని రాములు ప్రశ్నించాడు. ఇరువర్గాలు 15 రోజుల నుంచి పోలీసులు, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతూ ఉన్నారు. రెండు రోజుల క్రితం రెవెన్యూ అధికారులు సర్వే చేయడానికి వచ్చి సర్వే చేయకుండానే వెళ్లిపోయారు. అధికారులు బైనెంబర్ల ప్రకారం ఇరు కుటుంబాలకు భూ కబ్జా చూపించలేకపోయారు. ఆదివారం పొలం వద్ద చాపల రాములు, నర్సింహులు కుటుంబసభ్యులు.. బండి మనోజ్, నర్సింహులు విత్తనాలు వేస్తూ.. సాగు విషయంలో ఒకరిపై ఒకరు కర్రలతో దాడులు చేసుకున్నారు. దీంతో మనోజ్, నర్సింహులుకు తీవ్రగాయాలయ్యాయి. చాపల రాములు కుటుంబసభ్యులకు స్వల్పగాయాలయ్యాయి.

నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదు

బండి మనోజ్ ఫిర్యాదు మేరకు చాపల రాములు, నర్సింహులు, మానస, లక్ష్మిలపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆనంద్‌కుమార్ తెలిపారు. ఒకే వర్గంపై కేసు నమోదు విషయమై ఎస్ఐని వివరణ కోరగా.. వారి ఫిర్యాదు అందలేదని పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బండి మనోజ్ కుటుంబంపై కూడా కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమే దాడికి కారణం

రెవెన్యూ అధికారులు స్పందించి ఇరు కుటుంబాలకు భూమి సర్వే చేసి కబ్జా చూపిస్తే ఈ దాడి జరిగేది కాదు. కాని వారి నిర్లక్ష్యం కారణంగా ఆ భూమి తమదంటే తమదని ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారని పలువురు గ్రామస్తులు పేర్కొంటున్నారు.

భౌగోళిక వైవిధ్యాన్ని పరిరక్షించాలి



ఖాజా హిల్స్ వద్ద అంతర్జాతీయ జియో డైవర్సిటీ-2024లో పాల్గొన్న ట్రస్ట్ సభ్యులు

మణికొండ, అక్టోబర్ 6: భౌగోళిక వైవిధ్యాన్ని పరిరక్షించకపోతే పర్యావరణాన్ని కాపాడలేమని దక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ వేదకుమార్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ జియో డైవర్సిటీ-2024 డేను పురస్కరించుకొని దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఆధ్వర్యంలో జియో హెరిటేజ్ ట్రయల్, టాక్ ఆన్ జియో డైవర్సిటీని నిర్వహించారు. ఫక్రుద్దీన్‌గుట్ట(ఖాజా హిల్స్)లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి దక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ వేదకుమార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఇతర స్వచ్ఛంద సంస్థలతో కలిసి 2022 నుంచి అంతర్జాతీయ జియో డైవర్సిటీ డేను నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణలోని జియో హెరిటేజ్ సైట్లపై అవగాహన కల్పించేందుకు ఈ సంవత్సరం ఫక్రుద్దీన్ గుట్టను సందర్శించామని తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ మహేందర్‌రెడ్డి, కొత్త తెలంగాణ చరిత్ర బృందం రామోజు హరగోపాల్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చక్కిలం వేణుగోపాలరావు, సోమరామ్‌మూర్తి, ఎ.ఆర్.రామ్‌రాజ్, సకీనా, జనాబ్ జాజీర్ హుస్సేన్, వేముగంటి మురళీకృష్ణ, శోభాసింగ్, ఎస్.ఎస్.ప్రసాద్, పర్యాటక శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ వై.సుభాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండుగ వేళ.. 'వండర్' ఆఫర్లు

సిటీబ్యూరో, అక్టోబర్ 6(నమస్తే తెలంగాణ): దసరా నేపథ్యంలో నగరవాసులు వండర్ లాలో కుటుంబ సమేతంగా గడిపేందుకు ప్రత్యేక ఆఫర్లను అమలు చేస్తున్నామని వండర్ హాలీడేస్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ కె.చిట్టిలపల్లి తెలిపారు. దేశవ్యాప్తంగా ఎమ్యూజ్‌మెంట్ పార్కులను నిర్వహిస్తున్న వండర్ లా హైదరాబాద్‌లోని పార్కులో కొత్త రైడ్స్‌ను అందుబాటులోకి తీసుకురావడం, దీంతో పాటు ప్రత్యేక ఆఫర్లను ప్రవేశపెట్టామన్నారు. ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకున్న వారికి 2 టిక్కెట్లు కొంటే ఒక టిక్కెట్‌ను ఉచితంగా ఇస్తున్నామని, ఈ ఆఫర్ ఈ నెల 13వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. దీంతో పాటు వండర్ లా పార్కులోకి వచ్చిన తర్వాత రెండు ఫుడ్ కాంబో టిక్కెట్లు కొంటే ఒక టిక్కట్‌ను ఉచితంగా ఇస్తున్నామని ప్రకటించారు. కుటుంబాలు, స్నేహితులంతా కలిసి సరదాగా రోజంతా గడిపేందుకు వండర్ లాలో ప్రత్యేకమైన రైడ్స్ ఉన్నాయి.

అగ్రి వర్సిటీలో 14 నుంచి కౌన్సెలింగ్

వ్యవసాయ యూనివర్సిటీ, అక్టోబర్ 5 : ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం, పీవీ నర్సింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం బీఎస్సీ (హన్స్), అగ్రికల్చర్ బీఎస్సీ, కమ్యూనిటీ సైన్స్, బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, యానిమల్ హస్బెండరీ బీవీఎస్‌సీ అండ్‌ఏహెచ్, 2024-25 విద్యాసంవత్సరానికి గాను మొదటి సంవత్సరం కౌన్సెలింగ్ ఈ నెల 14 నుంచి 19 వరకు నిర్వహించనున్నట్లు వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రఘురామి రెడ్డి తెలిపారు. ఇందుకుగాను టీజీ ఎప్‌సెట్ 2024 అర్హత పొంది ఆన్‌లైన్‌లో అప్లై చే సిన వారు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

కనుల విందుగా కూచిపూడి నృత్యం

మాదాపూర్‌లోని శిల్పారామంలో శారీస్ ఆఫ్ ఇండియా, బతుకమ్మ ఉత్సవాల నేపథ్యంలో.. ఆదివారం టీకే సిస్టర్స్ డాక్టర్ సరోజ, డాక్టర్ సుజాత సంగీత కచేరి అలరించింది. జ్యోత్స్న శిష్య బృందం దేవీనవరాత్రుల నేపథ్యంలో ప్రదర్శించిన 'దేవీస్తుతి వైభవం' కూచిపూడి నృత్య రూపకం కనులవిందుగా సాగింది.

- కొండాపూర్

''శ్రీలక్ష్మి నీ మహిమలూ.. గౌరమ్మ చిత్రమై తోచు నమ్మా.. భారతీదేవివై.. బ్రహ్మకిల్లాలువై.. పార్వతీదేవివై పరమేశ్వరరాణివై పరగ శ్రీలక్ష్మివై గౌరమ్మ.. భార్యవైతివి హరికినీ...'' అంటూ నగరంలో పలు చోట్ల బాలికలు, యువతులు, మహిళలు అనేకం ఒకచోట చేరి బతుకమ్మ పండుగను అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారు. తొమ్మిది రోజుల బతుకమ్మ వేడుకలో ఆదివారం ఐదో రోజు కావడంతో అట్ల బతుకమ్మను మహిళలు భక్తిశ్రద్ధలతో పార్వతీదేవిని స్తుతిస్తూ, భక్తి పూర్వక గానాలాపనతో కోలాట మాడారు. ఆదివారం గోధుమ అట్లు లేదా బియ్యపు పిండితో చేసిన అట్లను అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు. తమ బతుకులను తీర్చిదిద్దాలని ప్రతి మహిళ ఆ లక్ష్మీదేవిని వేడుకున్నారు.

చొక్కంపేట ఆంజనేయులుకు అంబేద్కర్ నేషనల్ అవార్డు

ఆంజనేయులుకు నేషనల్ అవార్డు అందజేస్తున్న బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ

షాబాద్, అక్టోబర్ 6: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు-2024 సంవత్సరానికి మాల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చొక్కంపేట ఆంజనేయులు అవార్డు అందుకున్నారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో జరిగిన సౌత్ ఇండియా బహుజన రైటర్స్ 8వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుబ్రహ్మణ్యం ఆంజనేయులుకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడానికి బహుజన సాహిత్య అకాడమీ వారు ప్రతి ఏడాది ప్రజా సామాజిక ఉద్యమకారులు, సంఘ సేవకులు, కవులు, రచయితలు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డును అందజేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి సుమారు 600 మంది డెలిగేట్స్ హాజరైనట్లు చెప్పారు. అనంతరం అవార్డు గ్రహీత చొక్కంపేట ఆంజనేయులు మాట్లాడుతూ.. తమను గుర్తించిన రాధాకృష్ణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు రావడంతో మరింత బాధ్యత పెరిగిందని, భవిష్యత్తులో రెట్టింపు ఉత్సాహంతో ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటామని తెలిపారు. కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ కార్యదర్శి విష్ణువర్ధన్, రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్ తదితరులు ఉన్నారు.

సీసీఎంబీ వైల్డ్ లైఫ్ వీక్‌కు అనూహ్య స్పందన

సిటీబ్యూరో, అక్టోబర్ 6(నమస్తే తెలంగాణ): సీసీఎంబీ వైల్డ్ లైఫ్ వీక్‌కు అనూహ్య స్పందన వచ్చింది. అత్తాపూర్‌లోని లాకోన్స్ ల్యాబొరేటరీలో వైల్డ్ లైఫ్ పరిశోధనలపై అవగాహన కల్పించేలా ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు, బయాలజిస్టులు, జీవశాస్త్ర పరిశోధన విద్యార్థులు హాజరయ్యారు. వైల్డ్‌లైఫ్ వీక్ కార్యక్రమంలో భాగంగా పెయింటింగ్, ప్రసంగాలు, చర్చావేదికలతో అంతరించిపోతున్న అరుదైన వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో పెయింటింగ్ పోటీలను నిర్వహించగా, సరీసృపాలు, క్రూర మృగాలు, అంతరించిపోతున్న జాతుల జీవవైవిధ్యం, వాటిని సంరక్షించే విధానాలు, డీఎన్ఏ ద్వారా వాటిని పరిరక్షించేందుకు ఉన్న అవకాశాలను వివరించారు. సీసీఎంబీ పరిశోధకులు అనురాధ రెడ్డితోపాటు పలువురు శాస్త్రవేత్తలు పలు అంశాలను చర్చించారు.

రాష్ట్రపతి నిలయంలో ముగిసిన కళా మహోత్సవ్

హాజరైన బ్రిటీష్ డిప్యూటీ కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, ఆర్మీ అధికారులు

బొల్లారం, అక్టోబర్ 6 : బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవ్ ముగింపు వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈశాన్య రాష్ట్రాల సాంస్కృతిక ఔత్సాహికులను ఒకచోట చేర్చేందుకు కళా మహోత్సవ్ వేడుకలు వేదికగా నిలిచాయని నిలయం అధికారిణి రజినీ ప్రియ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బ్రిటీష్ డిప్యూటీ కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, టాసా జనరల్ మేనేజర్ రాకేశ్ మనోచా, ఆర్మీ అధికారులు నమితా సింగ్, సుదీప్తా, లెఫ్టినెంట్ కల్నల్ శర్మ, రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయమూర్తి పట్టాభి రామారావు, టాసా కల్నల్ జబీన్ పాల్ హాజరయ్యారు. ఈ వేడుకల్లో ఈశాన్య రాష్ట్రాలకు చెందిన విభిన్న కళాకారులు, బ్యాండ్, బృందగానాలతో కూడిన ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి. పెవిలియన్‌లు, చేనేత వస్త్రాలు, వివిధ కళాకారులచే హస్త కళలు, యువత నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులకు సర్టిఫికేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ డైరెక్టర్ ప్రసన్న గోగోల్, రోషన్ రెహమాన్, సుభరిష్, షరీక్, హుస్సీయన్, సిబ్బంది పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన ఈశాన్య రాష్ట్రాలకు చెందిన బృందంతో ముఖ్య అతిథులు